సాక్షి సూర్యాపేట

శనివారం | 16 | నవంబర్ | 2024



12శాతం రిజర్వేషన్ కల్పించాలి

మాదిగలకు 12శాతం రిజర్వేషన్ కల్పించాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి డిమాండ్ చేశారు.

- 10లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం :	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 585.80 అడుగులు
ఇన్‌ఫ్లో	: 35,463 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 35,463 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 16,889 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 10,120 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 5,654 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 2,400
వరద కాల్వకు	: 400

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం :	644.40 అడుగులు
ఇన్‌ఫ్లో	: 623.38 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: నిల్
ఎడమకాల్వకు	: నిల్
కుడికాల్వకు	: నిల్

న్యూస్‌రీల్

నేడు నల్లగొండకు డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ రాక

నల్లగొండ: రాష్ట్రంలో స్థానిక సంస్థల రిజర్వేషన్ల దామాషా విషయమై ప్రజాభిప్రాయ సేకరణ కోసం డెడికేటెడ్ కమిషన్ శనివారం నల్లగొండ జిల్లాకు రానున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డెడికేటెడ్ కమిషన్ చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి భూసాని వెంకటేశ్వరరావు, సెక్రటరీ బి.సైదులు 16వ తేదీన ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నల్లగొండలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లాకు చెందిన బీసీ, ఇతర కుల సంఘాలు, ప్రజలు, సంస్థల నుంచి వ్యక్తిగత అభ్యర్థనలు, సలహాలు, సూచనల సేకరిస్తారని ఆమె తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఆయా సంఘాలు.. వారి వాదనలకు మద్దతుగా ఉన్న సమాచారం, మెటీరియల్, ఇతర సాక్ష్యాలతో డెడికేటెడ్ కమిషన్ ఎదుట హాజరై అభిప్రాయాలను చెప్పవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శివాలయంలో చండీహోమం



చండీ హోమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వత వర్ధిని రామలింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుద్రాభిషేకం , చండీహోమం, అభిషేక చేశారు.అదే విధంగా ప్రధానాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు అభిషేకం, అర్చన, ఆలయ ముఖమండపంలో సుదర్శన నారసింహహోమం, స్వామి, అమ్మవారికి నిత్యకల్యాణం సాయంత్రం జోడు సేవోత్సవం తదితర పూజలు చేపట్టారు. అదే విధంగా ఊంజలి సేవోత్సవం నేత్రపర్వంగా సాగాంది.

కనులపండువగా చక్రతీర్థం



చక్రతీర్థం వేడుక నిర్వహిస్తున్న అర్చకులు

వలిగొండ: యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వెంకటాపురంలోని శ్రీమత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం అయ్యాయి. చివరి రోజు శుక్రవారం కుంబారాధన, చతుస్థానార్చన, నిత్యాహోమాలు, ద్వారాతోరణ బలి, మహాపూర్ణాహుతి, చక్రతీర్థం, నివేదన, తీర్థప్రసాద గోష్ఠి వేడుకలను కనులపండువగా నిర్వహించారు. ఆలయ హుండీలను శనివారం లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ మోహన్‌బాబు తెలిపారు. వేడుకల్లో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్‌కుమార్, సభ్యులు, పాల్గొన్నారు. అదే విధంగా కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు.

బూరుగడ్డలో ముగిసిన పవిత్రోత్సవాలు



కుంభప్రోక్షణలో పాల్గొన్న అర్చకులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీశాల్మలీకంద ఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో పవిత్రోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో సుప్రభాత సేవ, ఆరాధన, సేవాకాలం, నిత్యహోమం, మహాపూర్ణాహుతి, కుంభప్రోక్షణ, అర్చన, నివేదనలు, మంగళాశాసనం, పవిత్రములు, వితరణ, అనంతరం కార్తీక పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. తదనంతరం ఆలయంలో శ్రీగోదాదేవికి పల్లకీసేవ, తీర్థప్రసాదగోష్ఠి, ఆరగింపు తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యరగాని గురవయ్యగౌడ్, ఈఓ ఎంపి లక్ష్మణరావు, అర్చకులు, ముడుంబై పవన్‌కుమారాచార్యులు, హరీష్‌కుమార్‌చార్యులు, నర్సింహాచార్యులు, శ్రీనివాసాచార్యులు, ధర్మకర్తలు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.







కార్తీక శోభ

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం పిల్లలమర్రి శివాలయంలో శివలింగం ఆకారంలో వెలిగించిన దీపాలు

సూర్యాపేటలోని విద్యానగర్‌లో శ్రీరామలింగేశ్వర ఆలయంలో నిర్వహించిన జ్వాలాతోరణ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్ పట్టణంలోని శ్రీపార్వతీ భీమలింగేశ్వర స్వామి ఆలయంలో ఆకాశదీపాన్ని దర్శించుకుంటున్న భక్తులు

లక్ష్యం తగ్గినా.. నిదానమే!

నత్తనడకన చేపపిల్లల పంపిణీ

- ఈ సారి లక్ష్యం 1.70 కోట్ల చేపపిల్లలు
- నేటి వరకు పంపిణీ చేసింది 41.17శాతం మాత్రమే..



నెలాఖరు వరకు పూర్తిచేస్తాం

చేపపిల్లల పంపిణీలో ఎలాంటి ఆలస్యం లేదు. అధిక వర్షాలు వచ్చిన కారణంగా మొదట్లో పంపిణీ చేయలేదు. ప్రస్తుతం జిల్లాలో చేపపిల్లల పంపిణీ ముమ్మరంగా సాగుతోంది. ఈనెలాఖరు నాటికి చేపపిల్లల పంపిణీ పూర్తి చేస్తాం.

– నాగులునాయక్, జిల్లా మత్స్యశాఖ అధికారి

భానుపురి (సూర్యాపేట): ఉచిత చేపపిల్లల పంపిణీ జిల్లాలో నత్తనడకన కొనసాగుతోంది. ఈ యేడు లక్ష్యాన్ని పూర్తిచేసేందుకు అధికార యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ పెట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. టెండర్ల ప్రక్రియ మొదలు.. పంపిణీ సైతం ఆలస్యంగా చేపట్టగా.. చెరువుల్లో చేపపిల్లలు వదిలే కార్యక్రమాన్ని నిదానంగా కొనసాగిస్తున్నారు. జిల్లాలో 1.70కోట్ల చేపపిల్లల పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా నేటి వరకు కేవలం 41.17శాతం చేపపిల్లలను మాత్రమే చెరువుల్లో వదిలారు. ఇక ఈ కార్యక్రమం తుంగతుర్తి నియోజకవర్గంలో ప్రారంభం కాకపోవడం గమనార్హం.

మొత్తం నీటి వనరులు	1,340
చేపపిల్లలు వదిలేందుకు ఎంపికైనవి	621
మత్స్య సహకార సంఘాలు	134
సభ్యుల సంఖ్య	15,736
చేపపిల్లల టార్గెట్	1.70కోట్లు
ఇప్పటి వరకు వదిలినవి	70లక్షలు

సగానికి తగ్గిన లక్ష్యం..

ముందుగా జిల్లాలోని 621 చెరువుల్లో ఈ సంవత్సరం 3.40 కోట్ల చేపపిల్లలను వదలాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. అయితే ఈ పథకం అమలులో ఏటా అవినీతి, అక్రమాలు చోటుచేసుకుని ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదన్న విమర్శలు వచ్చాయి. ప్రధానంగా మత్స్యకారులకు కాకుండా కాంట్రాక్టర్లకు మాత్రమే ఈ పథకం ద్వారా మేలు జరుగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే పథకాన్ని కొనసాగించాలా.. వద్దా..? అన్న సందేహాల నుంచి లక్ష్యాన్ని సగానికి కుదించేశారు. దీంతో కోటి 70 లక్షల చేపపిల్లలు పంపిణీ చేపట్టాలని నిర్ణయించారు.

సమృద్ధిగా నీరున్నా..

జిల్లాలో మొత్తం 1,340 నీటి వనరులు ఉండగా ఈ సంవత్సరం 621 చెరువుల్లోనే చేపపిల్లలు పంపిణీ చేయాలని నిర్ణయించారు. టెండర్ల ప్రక్రియ నుంచి ఖరారు వరకు ఆలస్యమైంది. వర్షాలు సైతం మొదట్లో ముఖం చాటేసినా టెండర్లు పూర్తయ్యే నాటికి సెప్టెంబర్ మొదటి వారంలోనే సమృద్ధిగా కురిశాయి. దాదాపు 90 శాతం మేర చెరువులు, కుంటలు అలుగులు పోశాయి. కాగా వర్షాలు అధికంగా ఉన్నాయని భావించి చేపపిల్లల పంపిణీని ఆలస్యం చేశారు. కానీ వర్షాలు తగ్గుముఖం పట్టినా ఎవరూ పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం చెరువుల్లో చేపపిల్లలు పోసే అదును దాటిపోతోంది. అయినా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యంలో సగం కూడా చేరలేదు. ఇప్పటి వరకు 70లక్షల చేపపిల్లలు మాత్రమే జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన చెరువుల్లో పోశారు. ఇప్పటికైనా అధికారులు పథకాన్ని వేగవంతం చేసి చెరువుల్లోకి చేపపిల్లలను వదలాలని మత్స్యకారులు కోరుతున్నారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన కేంద్రాలు

- అదనపు కలెక్టర్ రాంబాబు

భానుపురి (సూర్యాపేట): గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని, వాటిని యువత సద్వినియోగం చేసుకుంటూ పోటీ పరీక్షలకు ప్రిపేరై ఉద్యోగాలు సాధించాలని అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సూర్యాపేట పట్టణంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వట్టికోట ఆళ్వారుస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత పట్టుదలతో చదివితే తప్పకుండా విజేతలవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, సుధాకర్ పీవీసీ గ్రూప్ చైర్మన్ మీలా మహదేవ్, యాదగిరి, సైదాచారి, వెంకట్, బీవీ. రెడ్డి, శర్మ, శ్యాంసుందర్‌రెడ్డి, రంగారావు, విజయభాస్కర్, సృజన, నిర్మల, లక్ష్మి, శ్రీను పాల్గొన్నారు.



పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు తదితరులు

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బీబీనగర్: యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల పరిధిలోని ఆర్మీ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్, గణితం, జనరల్ సైన్స్ సబ్జెక్టులు బోధించుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నిరూప ఒక ప్రకటనలో తెలిపారు. పీహెచ్‌డీ, నెట్, సెట్, పీజీ అర్హతలు కలిగి ఉండాలని, పైసబ్జెక్టుల్లో బోధన అనుభవం కలిగి ఉన్న వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గలవారు డిసెంబర్ 2 తేదీలోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అడవి బిడ్డల ఆరాధ్య దైవం బిర్సాముండా



మాట్లాడుతున్న ట్రైకార్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రవికుమార్

సూర్యాపేట టౌన్: అడవి బిడ్డల ఆరాధ్య దైవం బిర్సాముండా అని ట్రైకార్ డిప్యూటీ జనరల్ మేనేజర్ బి.రవికుమార్ అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని గిరినగర్ ప్రభుత్వ గిరిజన బాలికల వసతి గృహంలో గిరిజన పోరాట యోధుడు బిర్సాముండా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిర్సాముండా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. బిర్సా ముండా జార్ఖండ్‌లో 1875 నవంబర్ 15న జన్మించారని, ఆయన కేవలం 25 సంవత్సరాలు మాత్రమే జీవించి ఆదివాసి స్వతంత్ర రాజ్య స్థాపన కోసం బ్రిటిష్ వారితో వీరోచితంగా పోరాడారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డీటీడీఓ కె.శంకర్, రిటైర్డ్ డీటీడీఓ ఎల్.పాండునాయక్, ఏఓ శాంతికుమార్, వార్డెన్లు గిరిధర్‌రెడ్డి, ఝాన్సీరాణి, కవిత తదితరులు పాల్గొన్నారు.

మరో పోరుకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న కత్తి వెంకటేశ్వర్లు

కోదాడ రూరల్: ఎస్సీ వర్గీకరణ అమలు కోసం మాదిగ ఉద్యోగులు మరో పోరుకు సిద్ధం కావాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి కత్తి వెంకటేశ్వర్లు మాదిగ అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణంలో జరిగిన మాదిగ ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ పిలుపు మేరకు ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ అమలయ్యేంత వరకు పోరాటాన్ని ఆపేది లేదన్నారు. హైదరాబాద్‌లో డిసెంబర్ 1న నిర్వహించ తలపెట్టిన రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు చేకూరి రమేష్‌బాబు, బొల్లికొండ కోటయ్య, మాది గుర్వయ్య, ఏపూరి పర్వతాలు, పాతకొట్ల ప్రకాష్, నెమ్మాది ఉపేందర్, సైదులు, ఆనంద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రామలింగేశ్వరుని కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలోగల శివాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీపార్వతీరామలింగేశ్వరస్వామి కల్యాణాన్ని శుక్రవారం రాత్రి అర్చకులు వేదమంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీస్వామి వారికి ఏకాదశ మహారుద్రాభిషేకం చేపట్టారు. అనంతరం స్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం జరిపారు. ఆ తర్వాత గణపతిపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మధుపర్క పూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలతో కల్యాణం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపణీ చేశారు. ఈ కార్యక్రమంలో అలయ అనుశంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు మార్తి దుర్గాప్రసాద్ శర్మ, లక్ష్మీనరసింహమూర్తి, శివరామకృష్ణశర్మ, సుబ్రహ్మణ్యం, సీతారామాచార్యులు, రాజేష్, భక్తులు పాల్గొన్నారు.



మట్టపల్లి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాష్ట్రంలో అరాచక పాలన

- మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్



మాట్లాడుతున్న బడుగుల లింగయ్య యాదవ్

సూర్యాపేట టౌన్: తెలంగాణ రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి అరాచక పాలన సాగిస్తున్నారని మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్ ఆరోపించారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రులు బాంబులు పేలతాయని బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఉద్యమ పార్టీ అని, నాయకులు ఎవరికీ భయపడరని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చరిత్రను ఎవరూ చెరపలేరన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కాంగ్రెస్ నేతలు ప్రత్యర్థులపై దాడులకు దిగుతున్నారన్నారు. వికారాబాద్ జిల్లా లగచర్లలో రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కుంటే ఎవరూ ఊరుకోరన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, నెమ్మాది భిక్షం తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న విద్యార్థులు, పీడీఎస్‌యూ నాయకులు

భానుపురి (సూర్యాపేట): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి డిమాండ్ చేశారు. నాలుగేళ్లుగా పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌తోపాటు సకాలంలో స్కాలర్‌షిప్‌లు విడుదల చేయని ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ శుక్రవారం సూర్యాపేట పట్టణంలోని 60 ఫీట్ల రోడ్డులో ఆ సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఏడాదికి 4 లక్షల మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకుంటున్నా, వారందరికీ ప్రభుత్వం అందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ ముఖ్య నాయకులు, వివిధ కళాశాలల విద్యార్థులు, మమత, సంధ్య, నవ్య, శైలజ, వనజ, శివ, సందీప్, మహేష్,నవీను,వినయ్, వేణు,సాయిరాం, ఉదయ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

రైతుకు అందని పశు బీమా

ఈ చిత్రంలో కనపడే గొర్రెలు నెమ్మికల్, పాతర్లపహాడ్ గ్రామాలకు చెందిన గొర్రెల కాపరులవి. ఈనెల 1న వీటిని ఆయా గ్రామాల పరిధిలో మేపుకుని తిరిగి సొంత గ్రామాలకు వస్తుండగా రాత్రి యర్కారం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ఓ కారు అతివేగంగా వచ్చి గొర్రెల మందపైకి దూసుకెళ్లింది. దీంతో 20 గొర్రెలు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. వీటి విలువ సుమారు రూ.లక్షకు పైగా ఉంటుందని గొర్రెల కాపరులు చెప్పారు. జిల్లాలో ఇలా ప్రమాదాలకు బారిన పడుతున్నవి చాలానే ఉన్నా బీమా మాత్రం అందడం లేదు.



పథకం అమలు చేస్తే బీమా కల్పిస్తాం

పశు బీమా పథకం కొన్నేళ్లుగా అమలులో లేదు. గతంలో ప్రభుత్వం పంపిణీ చేసిన పథకాల్లో లబ్ధిదారులు పొందిన పశువులకు యూనిట్ విలువ నుంచి బీమా సదుపాయం కల్పించారు. రైతులు కొంత చెల్లిస్తే ప్రభుత్వం కొంత మొత్తం చెల్లించి పశువులకు బీమా కల్పించేది. పథకాన్ని అమలు చేసే బీమా సౌకర్యం కల్పిస్తాం.

– శ్రీనివాసరావు, జిల్లా పశువైద్యాధికారి, సూర్యాపేట

- ఆరేళ్లుగా నిలిచిన పథకం
- పశువులు చనిపోతే రూ.లక్షల్లో నష్టపోతున్న రైతులు
- అమలు చేసి ఆదుకోవాలని వేడుకోలు

సూర్యాపేట టౌన్: అన్నదాతలను కష్టాలు వీడడం లేదు. ఒకోసారి పంటలు దెబ్బతింటే రూ.లక్షల్లో నష్టపోతున్నారు. అదే తాము పెంచుకునే పశువులు, మేకలు, గొర్రెలు, ఇతర జంతువులు ఏదో కారణంగా చనిపోతే కూడా భారీగా నష్టాలను చవిచూస్తున్నారు. ఈ నేపథ్యంలో పంటల బీమా మాదిరిగానే ఆరేళ్ల క్రితం వరకు ప్రభుత్వం పశువులు చనిపోతే వాటికీ బీమా సౌకర్యం కల్పించేది. పాడి పశువులు, ఇతర జంతువులు బీమా సౌకర్యం ఉంటే ఆయా సంస్థల నుంచి గతంలో పశువు రకాన్ని బట్టి రూ.50వేల వరకు రైతులకు పరిహారం అందించేవి. ప్రస్తుతం రాష్ట్రంలో ఆరేళ్లుగా పశు బీమా పథకాన్ని నిలిపివేయడంతో రైతుల పశువులు చనిపోయినా బీమా సొమ్ము అందడం లేదు.

2017–18 సంవత్సరం వరకు అమలు..

గత ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన పశుబీమా పథకం 2017–18 వరకు అమలు చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆరేళ్లుగా ఈ పథకాన్ని పట్టించుకోకపోవడం లేదు. జిల్లా వ్యాప్తంగా దాదాపుగా అన్ని గ్రామాల్లో రైతులకు వ్యవసాయంతో పాటు పశువులను ఎక్కువగా పెంచుతున్నారు. అయితే గ్రామీణ ప్రాంతాల్లో పశువులు రోడ్డు ప్రమాదాలు, వర్షాల సమయంలో పిడుగులకు, విద్యుదాఘాతం, అనారోగ్యం కారణంగా మృత్యువాత పడుతున్నాయి. మేలు జాతి పాడి పశువులకు రూ.లక్షల్లో డిమాండ్ ఉంటుంది. అనివార్య కారణాలతో మృతి చెందితే రైతులు పూర్తి స్థాయిలో నష్టపోయి అప్పుల్లో కూరుకుపోతున్నారు. ప్రభుత్వాలు స్పందించి పశుబీమా పథకాన్ని వెంటనే అమల్లోకి తీసుకరావాలని రైతులు కోరుతున్నారు.

పశువులు	95,148
గేదెలు	289870
గొర్రెలు	7,79,920
మేకలు	1,40,000
పందులు	2,634
కోళ్లు	19,90,9000
ఇతర జంతువులు	8004
మొత్తం	33,05,576

క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైరు చోరీ

రాజాపేట: మండలంలోని జాల గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైరును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. రైతులు మొగిలి వెంకటయ్య, గజం నరసింహులు శుక్రవారం తమ వ్యవసాయ బావిలో వద్దకు వెళ్లగా రెండు ట్రాన్స్‌ఫార్మర్లు పగులగొట్టి ఉండగా.. అందులోని కాపర్ వైరు అపహరణకు గురైంది. ఈ మేరకు రైతులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి అదృశ్యం

చౌటుప్పల్ : పట్టణ కేంద్రానికి చెందిన బండి కృష్ణ(19) ఈనెల 11న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అతని తల్లి ఎల్లమ్మ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యాదగిరి తెలిపారు.

తిరుమలగిరిలో కారు బీభత్సం


ప్రమాదానికి గురైన కారు

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరిలో శుక్రవారం కారు బీభత్సం సృష్టించింది. తిరుమలగిరి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు తమ కారును మల్లీశ్వరి థియేటర్‌కు వెళ్లే దారిలో ఉన్న యూటర్న్ వద్ద ఒక్కసారిగా తిప్పడంతో డివైడర్‌ను ఢీకొట్టి అక్కడే నిలిచిపోయింది. దీంతో కారు ముందు భాగం దెబ్బతిన్నది. కారులో ఉన్న ఇద్దరు యువకులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు.

అదుపుతప్పి దుకాణాలపైకి దూసుకెళ్లిన కారు


ప్రమాదంలో ధ్వంసమైన దుకాణాలు

చింతపల్లి: మండల కేంద్రంలో తెల్లవారు జామున కారు బీభత్సం సృష్టించింది. హైదరాబాద్ నుంచి కారులో ఏడుగురు యువకులు చందంపేట మండలం వైజాగ్ కాలనీకి వస్తున్నారు. మార్గమధ్యంలో శుక్రవారం తెల్లవారు జామున చింతపల్లి మండల కేంద్రానికి రాగానే కారు డ్రైవర్ నిద్ర మత్తులో ఉండడంతో ఒక్కసారిగా హైదరాబాద్ నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారి పక్కనే ఉన్న మూడు దుకాణాల పైకి దూసుకెళ్లింది. దుకాణాల ముందు ఉన్న స్కూటీ తో పాటు దుకాణాలు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. కారులో ఉన్న యువకులకు ఎలాంటి గాయాలు కాలేదు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

- దేవరకొండ డీఎస్పీ గిరిబాబు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గిరిబాబు

గుర్రంపోడు: మండలంలోని ఎరడ్లగూడెం గ్రామం తోపాటు నాంపల్లి, కొండమల్లేపల్లిలో చోరీలకు పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు దేవరకొండ డీఎస్పీ గిరిబాబు తెలిపారు. శుక్రవారం గుర్రంపోడు పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం పాల్వాయి గ్రామానికి చెందిన వడ్డే గోపాల్, వడ్డే రామాంజనేయులు ఈ చోరీలకు పాల్పడినట్లు తెలిపారు. ఈ నెల 9న గుర్రంపోడు మండలంలోని ఎరడ్లగూడెం గ్రామంలో వంటెద్దు రాంరెడ్డి ఇంట్లో రూ.60వేల నగదు, అరతులం బంగారం చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు గాలింపు చర్యలు చేపట్టగా.. నిందితులు శుక్రవారం దేవరకొండకు బస్సులో వెళ్తున్నారనే సమాచారం మేరకు తనిఖీలు చేస్తుండగా ఆమలూరు స్టేజీ వద్ద ఇద్దరు వ్యక్తులు బస్సు దిగి పారిపోతుండగా పట్టుకుని విచారించారు. ఎరడ్లగూడెం చోరీతోపాటు కొండమల్లేపల్లి, నాంపల్లి మండలం నేరళ్లపల్లి గ్రామాల్లో చోరీలకు పాల్పడినట్లు వారు అంగీకరించారని తెలిపారు. నేరళ్లపల్లిలో పుస్తెలతాడు, కొండమల్లేపల్లిలో రూ.50 వేల నగదు, బంగారు ఆభరణాలు అపహరించినట్లు చెప్పారు. వీరి నుంచి మూడున్నర లక్షల విలువ గల సొత్తు, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చోరీ కేసును చేధించిన నాంపల్లి సీఐ ధనుంజయ, ఎస్ఐ మధు, సిబ్బంది హేమనాయక్, భాస్కర్, కావలి నర్సింహ, పి. సత్యనారాయణలను ఎస్పీ, డీఎస్పీలు అభినందించారు.

కేటీఆర్‌కు మతి భ్రమించింది


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం, పాల్గొన్న నాయకులు

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్: పదేళ్ల మంత్రిగా పనిచేసిన కేటీఆర్ కనీస విలువలు మర్చిపోయి మాట్లాడుతున్నాడని, ఆయన వ్యవహారశైలి తెలంగాణ ప్రభుత్వాన్ని, సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులను బద్నాం చేసే విధంగా ఉందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఫోన్ ట్యాపింగ్‌లో ప్రధాన సూత్రధారిగా వ్యవహరించిన కేటీఆర్.. నేడు మతిభ్రమించి ఆరోపణలు చేస్తున్నాడని అన్నారు. ఐఏఎస్ అధికారులపై తన పార్టీ వారిచే దాడులకు పురమాయిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేయాలనే ఆలోచనలో ఉన్నాడని ఆరోపించారు. తర్వాత తనను అరెస్టు చేస్తారని కేటీఆర్ తనకు తానే పత్రికల్లో రాయించుకుంటున్నాడని విమర్శించారు. కొడంగల్, వికారాబాద్ నియోజకవర్గాలు గత ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధికీ నోచుకోలేదన్నారు. ఆ ప్రాంతాల్లో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, అక్కడ భూముల రేట్లు పెంచి అభివృద్ధి చేయాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి ఉద్దేశమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడ కూడా కక్ష సాధింపు చర్యలు లేకుండా పాలన సాగిస్తోందని చెప్పారు. విలేకరుల సమావేశంలో నాయకులు పూజర్ల శంభయ్య, చామల శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గీత కార్మికుల సంక్షేమానికి కృషి

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి


గీత కార్మికులకు సేఫ్టీ మోకులు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు : గీత కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మునుగోడు నియోజకవర్గంలోని 200మంది కల్లు గీత కార్మికులకు మంజూరైన సేఫ్టీ మోకులను శుక్రవారం మండల కేంద్రంలో ఆయన పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. గీత వృత్తి ఎంతో ప్రమాదకరమైనదని, కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు ప్రభుత్వం సేఫ్టీ మోకులు అందిస్తుందన్నారు. కల్లు గీసుకుంటూ జీవనం కొనసాగించే ప్రతికార్మికుడు తాటిచెట్టు ఎక్కేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. గ్రామాల్లో బెల్టు దుకాణాల మూసివేతకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, ఎక్సైజ్ జిల్లా అధికారి చాణక్య, బీసీ సంక్షేమశాఖ అధికారి సంజీవ, రామన్నపేట, నాంపల్లి, చండూరు ఎక్సైజ్ అధికారులు బాలాజీనాయక్, సైదులు, కుర్మనాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో విద్యుత్ సమస్య ఉండొద్దు

గ్రామాల్లో విద్యుత్ సమస్య లేకుండా అధికారులు చొరవ చూపాలని, అందుకు అవసరమైన నిధులు ప్రభుత్వం నుంచి మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మునుగోడు మండల కేంద్రంలోని తన క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏయే గ్రామాల్లో విద్యుత్ సమస్యలు నెలకొన్నాయి, అందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలి, అందుకు అవసరమయ్యే నిధులెంతా అని అడిగి తెలుసుకున్నారు. సమీక్ష సమావేశంలో విద్యుత్‌శాఖ అధికారులు, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు పబ్బు రాజు, వేమిరెడ్డి సురేందర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, పల్లె వెంకన్న తదితరులు ఉన్నారు.

వేణుగోపాలస్వామిని దర్శించుకున్న విదేశీయులు


శ్రీవారిజాల వేణుగోపాలస్వామి దేవాలయంలో విదేశీయులు

నార్కట్‌పల్లి: కార్తీక పౌర్ణమి సందర్భంగా నార్కట్‌పల్లి మండల పరిధిలోని గోపలాయపల్లి సమీపంలో గల శ్రీవారిజాల వేణుగోపాలస్వామి దేవాలయాన్ని శుక్రవారం రష్యా దేశస్తులు సందర్శించారు. విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తూ ఈ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసినట్లు వారు తెలిపారు. ఆలయ అర్చకులు వారికి ఆశీర్వచనం చేశారు. ఆలయ అనువంశిక చైర్మన్ కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి వారిని సన్మానించారు.

బస్సుల సంఖ్య పెంచాలి

నల్లగొండ రూరల్ : బస్సుల సంఖ్యను పెంచాలని ఆర్టీసీ ఆర్ఎం రాజశేఖర్‌కు ప్రయాణికులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమానికి ఫోన్ ద్వారా తమ సమస్యలను విన్నవించారు. మహాలక్ష్మి పథకంతో అన్ని బస్సులో మహిళా ప్రయాణికులు ఎక్కువగా ఉండటం వల్ల సీట్లు దొరకడం లేదని బస్సుల సంఖ్య పెంచాలని కోరారు. బస్టాండ్‌లో పరిశుభ్రత మెరుగు పరచాలని, గ్రామీణ ప్రాంతాలకు బస్సులు నడపాలని, సూర్యాపేట, నల్లగొండ మధ్య బస్సులు పెంచాలని కోరారు. పది రూపాయల నాణేలను కండక్టర్లు తీసుకోవడం లేదని ఆర్ఎం దృష్టికి తీసుకెళ్లగా ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం చెల్లుబాటు అవుతాయని కండక్టర్లంతా నాణేలు తీసుకుంటారని తెలిపారు.

రైతు ఆత్మహత్యాయత్నం

నూతనకల్: తన సొంత వ్యవసాయ పొలంలోకి ఉన్న దారి నుంచి వరికోత మిషన్ వెళ్లనివ్వకుండా కొంత మంది రైతులు అడ్డుకోవడంతో మనస్తాపానికి గురైన రైతు క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన నూతనకల్ మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. బాధిత రైతు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దేశమల్ల వెంకన్న వ్యవసాయ భూమిలోకి వరికోత మిషన్ రాకుండా అడ్డుకుంటున్నారని మనస్తాపానికి గురై పురుగుల తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అతడిని సూర్యాపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. తమ కుటుంబాన్ని వేధిస్తున్న రైతులపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

జూదరుల అరెస్టు

భువనగిరి క్రైం: భువనగిరి మండలంలోని హన్మాపురం గ్రామ శివారులో శుక్రవారం పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపారు. హన్మాపురం సబ్ స్టేషన్‌కు వెళ్లే దారిలో పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో ఎస్ఓటీ పోలీసులు, భువనగిరి రూరల్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.26,400 నగదు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మాదిగలకు 12శాతం రిజర్వేషన్ కల్పించాలి

- ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి


సమావేశంలో మాట్లాడుతున్న పిడమర్తి రవి

కోదాడరూరల్ : తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీలలో మాదిగలకు 12శాత రిజర్వేషన్ కల్పించాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాదిగలకు 12శాతం రిజర్వేషన్ కోసం పోరాడుతుంటే.. కాంగ్రెస్ పార్టీకి చెందిన గడ్డం వివేక్ అడ్డుపడుతున్నాడని అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన మాదిగల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. షెడ్యూల్డ్ కులాల్లో గల 59 ఉపకులాల్లో మాదిగలే ఎక్కువ ఉన్నందున ఏబీసీడీ వర్గీకరణ చేపట్టి ఏ కు 6శాతం, బీ 7, సీ 1, డీ 1శాతం రిజర్వేన్‌లు కల్పించాలన్నారు. ఏబీసీడీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా మాదిగలకు అన్యాయం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. 12 శాతం రిజర్వేషన్ కోసం 119 నియోజకవర్గాల్లో పర్యటించి మాదిగలను చైతన్యం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కొండమీద గోవిందరావు, బెజవాడ శ్రవణ్, పిడమర్తి దశరథ, రాహుల్, వేణు, లాజర్, గోపి, రవి పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి

మిర్యాలగూడ : మాదిగల జనాభా ప్రాతిపదికన ఎస్సీ రిజర్వేషన్లు కల్పించాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. శుక్రవారం మిర్యాలగూడలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి మాదిగల సమావేశంలో ఆయన మాట్లాడారు. 30ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణపై అనేక రూపాల్లో ఉద్యమం చేస్తున్నట్లు తెలిపారు. ఉద్యమ ఫలితంగానే ఏబీసీడీ వర్గీకరణకు ఆమోదం లభించిందన్నారు. ప్రస్తుతం జనాభా ప్రకారం మాదిగలకు 12శాతం రిజర్వేషన్లు కల్పించాలని, జిల్లాలు యూనిట్ చేసినప్పుడే మాదిగలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈనెల 23న నల్లగొండలో ఏర్పాటు చేసే మాదిగల సమ్మేళనానికి భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కొండకింది గోవిందరావు, కొమ్ము శ్రీనివాస్, ఉబ్బపల్లి కాశయ్య, వట్టె జానయ్య, దైద రవి, ఊర రామకృష్ణ, శ్రవణ్, రాజశేఖర్, మట్టయ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

యాదగిరీశుడి సన్నిధిలో కార్తీక దీపారాధన


ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న ఈఓ భాస్కర్‌రావు


ప్రధానాలయ ధ్వజస్తంభంపై ఆకాశ దీపం

యాదగిరిగుట్ట: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం యాదగిరీశుడి సన్నిధిలో, కొండపైన విష్ణు పుష్కరిణి, శివాలయంలో సామూహిక కార్తీక దీపారాధన నిర్వహించారు. శివాలయంలోని ధ్వజ స్తంభం ఎదుట మహిళలు దీపారాధన చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఇక.. సాయంత్రం శ్రీస్వామి వారి ప్రధానాలయంలోని ధ్వజస్తంభం వద్ద ఆకాశా దీపోత్సవం చేపట్టారు. ఆగమ శాస్త్రానుసారం ధ్వజ స్తంభం వద్ద ఆకాశా దీపానికి పూజలు చేసి, ధ్వజ స్తంభం పైకి ప్రత్యేక దీపాన్ని పంపించారు. ఆయా పూజల్లో ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలి

- తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న రాజశేఖర్ రెడ్డి

మిర్యాలగూడ అర్బన్ : ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మిర్యాలగూడలోని టీఎస్‌యూటీఎఫ్ భవన్‌లో నిర్వహించిన డివిజన్ మహాసభలో ఆయన మాట్లాడారు. అనంతరం మండల శాఖలకు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పరిశీలకులుగా రాష్ట్ర మహిళా కార్యదర్శి నాగమణి, బక్కా శ్రీనివాసచారి, జిల్లా కార్యదర్శులు మోర్తాల శ్రీనివాస్‌రెడ్డి, ఆడోతు చిన వెంకన్న, దయాకర్ రెడ్డి, విజయలక్ష్మి, చంద్రశేఖర్ వ్యవహరించారు. జరిగాయి. మిర్యాలగూడ పట్టణ శాఖ అధ్యక్షుడిగా కోడిరెక్క జయరాజు, ప్రధాన కార్యదర్శిగా ఎండీ.సాజిత్ అలీ, రూరల్ శాఖ అధ్యక్షుడిగా ఉస్మాన్, ప్రధాన కార్యదర్శిగా పులి సత్యనారాయణ, దామరచర్ల మండల శాఖ అధ్యక్షుడిగా బి.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా సిహెచ్.శ్యామ్‌కుమార్ ఎన్నికయ్యారు.

‘నా పంట యాప్’పై రైతులకు అవగాహన


రైతులతో అగ్రికల్చర్ విద్యార్థులు

గరిడేపల్లి: గడ్డిపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ‘నా పంట యాప్’ను వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శిక్షణ పొందుతున్న మల్లారెడ్డి యూనివర్సిటీ బీఎస్సీ అగ్రికల్చర్ చదువుతున్న విద్యార్థులు మాట్లాడుతూ.. మార్కెట్, వాతావరణం, కీటకాలు, తెగుళ్లు, కలుపు, పోషక లోపాల వంటి సమాచారం యాప్‌లో అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ఘంట సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి బాచు సైదయ్య, విద్యార్థినులు అనిత, అమిషా, వర్షిత, అశ్విని, ఎస్. దీక్షిత, దివ్య, లావణ్య, నేహ, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి


చిర్రగూడూరు స్టేజి వద్ద అంజయ్య మృతదేహంతో ధర్నా చేస్తున్న కుటుంబసభ్యులు, గ్రామస్తులు

అడ్డగూడూరు: అడ్డగూడూరు మండల పరిధిలోని చిర్రగూడూరు గ్రామానికి చెందిన కమ్మంపాటి అంజయ్య (57) గురువారం రాత్రి వలిగొండ – తొర్రూర్ ప్రధాన రహదారిపై టీవీఎస్ మోటారుసైకిల్‌పై వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. చిర్రగూడూరు వద్ద రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నట్లు కాంట్రాక్టర్ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయలేదని, ఈ కారణంగానే రోడ్డు రోలర్‌ను ఢీకొని అంజయ్య మృతిచెందాడని కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఆరోపిస్తూ చిర్రగూడూరు స్టేజి వద్ద మృతదేహంతో శుక్రవారం ధర్నా నిర్వహించారు. న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఐ నాగరాజు, పోలీసు సిబ్బంది అక్కడకు చేరుకుని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేయగా వారు వినిపించుకోకపోవడంతో పోలీసులకు, మృతుడి బంధువుల మధ్య వాగ్వాదం నెలకొంది. విషయం తెలుసుకున్న చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు అక్కడి చేరుకున్నారు. సదరు కాంట్రాక్టర్‌తో మాట్లాడి న్యాయం చేస్తామని చెప్పడంతో వారు ధర్నా విరమించారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

రాజాపేట: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాజాపేట మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై ఉపేందర్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజాపేటకు చెందిన మేకల వెంకటేష్ (30)కు బసంతపురం గ్రామానికి చెందిన పవిత్రతో ఆరు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వెంకటేష్ జీవనోపాధి కోసం కారు నడుపుతూ హైదరాబాద్‌లోని వారాసిగూడలో ఉంటున్నాడు. భార్యాభర్తల మధ్య గొడవ కారణంగా వెంకటేష్ రాజాపేటకు వచ్చాడు. దీంతో అత్త, బావలు వచ్చి వెంకటేష్‌కు సర్ది చెప్పి అతడి భార్యా పిల్లలను తీసుకొని హైదరాబాద్‌కు వెళ్లారు. భార్యా పిల్లలపై బెంగతో వెంకటేష్ మద్యానికి అలవాటు పడ్డాడు. ఈక్రమంలో మంగళవారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చి పడుకున్నాడు. తెల్లవారి లేచి చూసేసరికి వెంకటేష్ కనిపించలేదు. ఆచూకీ కోసం తండ్రి సత్తయ్య తమ బంధువుల ఇళ్లల్లో వెతికినా కనిపించలేదు. శుక్రవారం ఉదయం రాజాపేట శివారులోని దాచె పల్లి రాజు వ్యవసాయ బావిలో మృతదేహం కనిపించడంతో రైతు ఎర్ర గోకుల నర్సింహ గ్రామస్తులకు సమాచారం అందించాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతుడు మేకల వెంకటేష్‌గా గుర్తించారు. తండ్రి సత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.

వరి కొయ్యలను కాల్చొద్దు


నడిగూడెం వద్ద కాల్చివేసిన వరి కొయ్యలు

నడిగూడెం: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరి కోతల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మరో వైపు రైతులు రబీ సీజన్ సాగుకు కూడా సన్నద్ధమవుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో కోసిన వరి కొయ్యలకు రైతులు నిప్పంటిస్తున్నారు. ఇలా చేయడం వల్ల భూమిలో పంటకు ఉపయోగమయ్యే క్రిమికీటకాలు చనిపోతాయని, పంటకు తీవ్ర నష్టం జరుగుతుందని నడిగూడెం మండల వ్యవసాయాధికారి రాయపు దేవప్రసాద్ తెలిపారు. వరి మొదళ్లను కాల్చడం ద్వారా కలిగే నష్టాలు ఆయన మాటల్లోనే..

లాభాలు తెలియక వరి మొదళ్లు కాలుస్తున్న రైతులు

నేడు ఆధునిక యంత్రాలు అందుబాటులో రావడంతో వరి పంటను 15–30 సెం.మీ. పైకి మాత్రమే కోయడంతో వరి మొదళ్లు పెద్దవిగా ఉంటున్నాయి. ఒకప్పుడు మనుషులు కోసినప్పుడు పశుగ్రాసం కూడా అధికంగా లభించేది. నేడు ఆధునిక యంత్రాలతో వరి కోయడం వల్ల పశుగ్రాసం దొరకని పరిస్థితి నెలకొన్నది. వరికొయ్యలను కాల్చడంతో భూమిలోని సారంతోపాటు, మేలు చేసే క్రిములు చనిపోయి పంట దిగుబడి తగ్గుతుంది. దిగుబడి కోసం రైతులు ఇతర క్రిమిసంహారక మందులు వాడడంతో పెట్టుబడి కూడా పెరుగుతుంది. కొయ్యలను కాల్చకుండా అలాగే దున్నడం వల్ల సూక్ష్మపోషకాలు పెరుగుతాయి. భూసారానికి ఎంతో మేలు కలుగుతుంది.



వరి కొయ్యలకు నిప్పు పెడితే కలిగే నష్టాలు

- వరి మొదళ్లను కాల్చడం వల్ల మంటలు ఎగబడి వేడి తీవ్రతకు సూక్ష్మజీవులు చనిపోతాయి.
- ఆశించిన మేర వరి పంట దిగుబడి రాదు.
- వరి మొదళ్లలో నత్రజని, భాస్వరం, పొటాషియంతో పాటు సూక్ష్మజీవులు ఉంటాయి. మొదళ్లను కాల్చడం వల్ల ఈ పోషకాలు నేలలో కలవకుండా మంటకు మాడిపోతాయి.
- తరచుగా గడ్డి కాల్చే పొలాల్లో నేల కోతకు గురవుతుంది. తద్వారా నేలపైన ఉండే సారవంతమైన పొర కొట్టుకుపోతుంది.
- పొలంపై గడ్డి తగలపెట్టడం వల్ల కాలుష్యం ఏర్పడుతుంది. గ్లోబల్ వార్మింగ్ ఏర్పడి వాతావరణం ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం లేకపోలేదు.

వరి మొదళ్లను కలియదున్నడం వల్ల కలిగే లాభాలు

- భూమిలో సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయి.
- నేలకు సేంద్రియ పదార్థం అందుతుంది.
- యూరియా, డీఏపీ, పొటాష్ వేయడం వల్ల ఎంత ప్రయోజనం చేకూరుతుందో నేలకు అంత సేంద్రియ పదార్థం అందుతుంది.
- నేల కోతకు గురి కాకుండా ఉంటుంది.
- భూమికి నీటిని, పోషకాలను నిల్వ ఉంచే గుణం పెంచుతుంది.
- వాయు కాలుష్యం జరగకుండా ఉంటుంది.
- వరిగడ్డి మొదళ్లు పశువులకు మేతగా ఉపయోగపడుతుంది.
- వరి కొయ్యలు కుళ్లడంతో పంటకు ఎరువుగా ఉపయోగపడి దిగుబడులు పెరిగే అవకాశం ఉంది.
- గడ్డి తిని బతికే కీటకాలు, పశువులకు ఆహార కొరత ఏర్పడే అవకాశం ఉంది.